క్లుప్తంగా

వైభవంగా ఏకాదశి తిరువీధి



మదన గోపాలస్వామి తిరువీధిలో భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని సింహగిరిపై మదనగోపాలస్వామి తిరువీధి మంగళవారం సాయంత్రం వైభవంగా జరిగింది. స్వామివారి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి డోలీలో వేంజేపచేశారు. సింహగిరి మాడవీధిలో తిరువీధి ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, వైదికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో కొలువైన వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేషంగా పూజలు జరిగాయి. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.

ఘనంగా పోలిపిల్లి అమ్మవారి పండగ




సింహాచలం: 98వ వార్డు పరిధి అప్పన్నపాలెంలో కొలువైన పోలిపిల్లి అమ్మవారి మారువారం పండగ మంగళవారం ఘనంగా జరిగింది. పెద్ద సంఖ్యలో భక్తులు, గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు కుంకుమలు సమర్పించారు. మధ్యాహ్నం భారీ అన్న సమారాధన జరిపారు. అప్పన్నపాలెం, సింహపురికాలనీ, గొల్లనారాయణపురం, సింహపురి లేఅవుట్ తదితర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు.

వైభవంగా పరదేశిమాంబ పండగ



పెందుర్తి: చినముషిడివాడ ప్రజల ఆరాధ్య దేవత పరదేశిమాంబ అమ్మవారి వార్షిక పండగ మంగళవారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయం నుంచి విశేష అభిషేకాలు, అలంకరణ జరిపారు. అనంతరం వేలాదిగా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, చినముషిడివాడ, సుజాతనగర్, గొల్లవిల్లివానిపాలెం, పెందుర్తి ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్‌ల పంపిణీ



చెక్‌లు అందిస్తున్న ఎమ్మెల్యే పంచకర్ల

పెందుర్తి: నియోజకవర్గ పరిధిలో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురికి వైద్యం నిమిత్తం ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్‌లను ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు మంగళవారం పంపిణీ చేశారు. సుజాతనగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మొత్తం 9 మందికి రూ.14.92 లక్షల విలువైన చెక్‌లు అందించారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న వైద్యాధికారి సాయినాథ్

పెదగంట్యాడ: కిశోర బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని గంగవరం ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయినాథ్ అన్నారు. ఐసీడీఎస్ పెందుర్తి ప్రాజెక్ట్ అధికారి డి.నీలవేణి, సూపర్‌వైజర్ సుజాత ఆధ్వర్యంలో గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల గల కిశోర బాలికలు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారని, అవగాహన లోపం, తల్లిదండ్రుల పర్యవేక్షణ దీనికి ప్రధాన కారణమన్నారు. ఆడపిల్లలకు 20 ఏళ్లు వచ్చే వరకూ వివాహాలు చేయవద్దని కోరారు. చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల వారి ప్రాణాలకు ముప్పు ఉందన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు దుర్గమ్మ, శాంతి, దేవుడమ్మ, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెందుర్తిలోని 15 పంచాయతీలకు చేరని స్టాంప్ డ్యూటీ నిధులు

- రెండేళ్లుగా నిధులు రాకపోవడంతో పంచాయతీల నిర్వహణ కటకట
- పారిశుధ్య కార్మికుల జీతాలు, విద్యుత్ బిల్లులు, ఇతర చెల్లింపులపై ప్రభావం
- గగ్గోలు పెడుతున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

'పెందుర్తి మండలంలోని 15 పంచాయతీల నుంచి వీధిదీపాలు, సచివాలయాల విద్యుత్ చార్జీలు దాదాపు రూ.1.20 కోట్లు బకాయిలు ఉన్నాయి. అవి వసూలు చేయాలని మాకు ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడి ఉంది. తక్షణమే ఆయా నిధులు వచ్చేలా చర్యలు తీసుకోండి'

– మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో విద్యుత్ శాఖ ఏఈ రవికుమార్ వినతి

'మా పంచాయతీకి దాదాపు రూ.45 లక్షల స్టాంప్ డ్యూటీ బకాయిలు ఉన్నాయి. దీంతో పంచాయతీలోని పారిశుధ్య కార్మికుల జీతాలు, బ్లీచింగ్ కొనుగోలుకు కూడా ఇబ్బంది పడుతున్నాం. ఉన్నతాధికారులు స్పందించి స్టాంప్ డ్యూటీ నిధులు వచ్చేలా చూడాలి'

– మండల పరిషత్ సమావేశంలో పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య ఆవేదన

పంచాయతీలకు నిధులు స్టాప్



పెందుర్తి మండల పరిషత్ కార్యాలయం (ఇన్‌సెట్) గొరపల్లి పంచాయతీ సచివాలయం

పెందుర్తి: రిజిస్ట్రేషన్ శాఖను నుంచి పెందుర్తి మండలానికి రావాల్సిన స్టాంప్ డ్యూటీ నిధులకు మూడేళ్లుగా బ్రేకులు పడ్డాయి. పంచాయతీల వాటాగా రావల్సిన రూ.కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో మండలంలోని 15 పంచాయతీలు కనీస అవసరాలకూ నిధుల్లేక అవస్థలు పడుతున్నాయి. పారిశుధ్య కార్మికులకు జీతాలు ఇవ్వలేక, విద్యుత్ బకాయిలు చెల్లించలేక, గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సామగ్రి కొనుగోలు చేయలేక సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు అవసోపాలు పడుతున్నారు. ప్రస్తుతం ఈ పంచాయతీలు కేవలం ఇంటి/ఆస్తి పన్ను ద్వారా వచ్చిన నిధులతోనే 'సర్దుకుపోతున్నాయి'. రిజిస్ట్రేషన్ శాఖ అధికారుల నిర్లక్ష్యం, మండల పరిషత్ అధికారుల ఉదాసీనత వెరసి పంచాయతీలకు ఈ దుస్థితి పట్టింది.

బకాయి నిధులు రూ.5 కోట్లు

రెవెన్యూ పంచాయతీ పరిధిలోని భూములు, ఆస్తుల క్రయ విక్రయాల ద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు వచ్చిన ఆదాయంలో నిబంధనల ప్రకారం 10 శాతం మండల పరిషత్‌కు చెల్లించాలి. అందులో సగం వాటాను పంచాయతీలకు, మిగిలిన సగం మండల పరిషత్, జిల్లా పరిషత్‌లు పంచుకుంటాయి. ఆయా నిధులను పంచాయతీల్లో పారిశుధ్య కార్మికుల జీతాలకు, పారిశుధ్య నిర్వహణ, విద్యుత్ బిల్లుల చెల్లింపులు, ఇతర సాధారణ పనులకు వినియోగిస్తారు. పెందుర్తి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ద్వారా 2022 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు దాదాపు రూ.10 కోట్లు స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. అంటే అందులో 15 పంచాయతీలకు రావాల్సి వాటా దాదాపు రూ.5 కోట్లు.



ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో స్టాంప్ డ్యూటీ బకాయిల గురించి అడుగుతున్న సభ్యులు

చెల్లింపులకు కటకట

మండలంలో పంచాయతీకి సగటున నలుగురు పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది ఇద్దరు చొప్పున పనిచేస్తున్నారు. వారికి జీతాలతో పాటు గ్రామాల్లో విద్యుత్ బిల్లులు, ఇతర సాధారణ పనుల కోసం సాధారణ నిధులనే(స్టాంప్‌డ్యూటీతో పాటు పన్నుల రూపంలో వచ్చే సొమ్ము) వెచ్చించాలి. సమయానికి జీతాలివ్వకపోవడంతో పారిశుధ్య కార్మికులు, ఔట్ సోర్సింగ్ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.కోట్లలో విద్యుత్ బకాయిలు ఉండడంతో ఆ శాఖ అధికారులు సైతం పంచాయతీలపై తీవ్ర ఒత్తిడి తెస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి స్టాంప్ డ్యూటీ బకాయిలు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జీతాలివ్వలేకపోతున్నాం



మా పంచాయతీ వరకు దాదాపు రూ.50 లక్షల స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. పన్నుల రూపంలో వచ్చే నిధులతోనే నెట్టుకొస్తున్నాం. సకాలంలో సిబ్బందికి జీతాలు ఇవ్వలేకపోవడం చాలా ఇబ్బందికరంగా ఉంది. అధికారులు తగిన చర్యలు తీసుకుని స్టాంప్ డ్యూటీ నిధులు వచ్చేలా చూడాలి.

– గొరపల్లి శ్రీను, సర్పంచ్, గొరపల్లి

ఇబ్బందులు పడుతున్నాం



మాది చిన్న పంచాయతీ. స్టాంప్ డ్యూటీ నిధులు కూడా తక్కువగానే వస్తాయి. రావాల్సిన నిధులు కూడా రాకపోతే పంచాయతీ నిర్వాహణ కష్టంగా ఉంటుంది. నెలలో ఒకటో తారీఖు వచ్చిందంటే సిబ్బంది జీతాలు ఎలా చెల్లించాలా? అని అధికారులు, మేము తర్జనభర్జన పడాల్సి వస్తోంది.

– కొయిలాడ శ్రీను, సర్పంచ్, గవరపాలెం

ఈపీడీసీఎల్ నుంచి ఒత్తిడి



స్టాంప్ డ్యూటీ నిధులు రాక పంచాయతీలో పారిశుధ్య సామగ్రి కూడా కొనలేకపోతున్నాం. నెల నెలా విద్యుత్ బకాయిల కోసం కార్యదర్శిపై ఒత్తిడి పడుతోంది. నిధులు లేకపోవడంతో పరిపాలనపై కూడా తీవ్ర ప్రభావం చూపిస్తోంది. ఉన్నతాధికారులు ఈ అంశంపై చొరవ తీసుకోవాలి.

– గనిశెట్టి వెంకటలక్ష్మి, సర్పంచ్, చింతగట్ల

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



2022 నుంచి రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయి ఉంది. గతంలో కూడా పలుమార్లు ఆ శాఖకు నివేదించాం. తాజాగా పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ బకాయిలు చెల్లించాలని లేఖ రాశాం. వారి సమాధానం ఆధారంగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకువెళ్తాం.

– కొల్లి వెంకట్రావు, ఎంపీడీవో, పెందుర్తి

కమ్యూనికేషన్ నైపుణ్యాల పెంపునకు వర్క్‌షాప్



ప్రసంగిస్తున్న సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో ఆర్ఎల్ఐ విభాగం సమన్వయంతో నిర్వహిస్తున్న కమ్యూనికేషన్ వర్క్‌షాప్‌ను సంస్థ సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారులు సద్వినియోగం చేసుకోవాలని ఈడీ సమీర్‌శర్మ సూచించారు. హెచ్‌వోపీ కాన్ఫరెన్స్ హాల్లో మంగళవారం నిర్వహించిన ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభించి, ఆయన మాట్లాడారు. సీనియర్ ఎగ్జిక్యూటివ్ అధికారుల్లో కమ్యూనికేషన్ నైపుణ్యాలను పెంపొందించడమే లక్ష్యంగా ఈ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ వర్క్‌షాపులో ఓరల్, లిఖిత వ్యాపార కమ్యూనికేషన్లపై విశాఖపట్నం ఐఐఎం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత వివరించారు. తొలి రోజు సెషన్‌లో ఎలిమెంట్స్ ఆఫ్ వెర్బల్, నాన్ వెర్బల్ కమ్యూనికేషన్, లిఖిత వ్యాపార కరస్పాండెన్స్‌లపై అవగాహన కల్పించారు. వర్క్‌షాపులో హెచ్‌ఆర్ హెడ్ బి.బి.పాత్ర, కార్పొరేట్ కమ్యూనికేషన్ బృందం పాల్గొంది. వర్క్‌షాపు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఓ అండ్ ఎం జీఎం పి.కె.జెనా, టెక్నికల్ సర్వీసెస్ జీఎం ఎస్.పద్మప్రియ, సీ అండ్ ఎం జీఎం వి.టి.కాంబ్లే, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

సబ్బవరం వైస్ ఎంపీపీ ఎన్నిక రేపు



మాట్లాడుతున్న ఎంపీడీవో పద్మజ

సబ్బవరం: మండలంలో ఖాళీగా ఉన్న వైస్ ఎంపీపీ స్థానానికి ఈ నెల 27(గురువారం)న ఎన్నికలు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పద్మజ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎన్నికల విధివిధానాలను వివరించారు. స్థానిక సంస్థల ఎన్నికల నిబంధనలు అనుసరించి స్థానిక మండల పరిషత్ సమావేశమందిరంలో చేతులెత్తే పద్ధతిలో వైస్ ఎంపీపీని ఎన్నుకోవడం జరుగుతుందన్నారు. గత వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్ వ్యక్తిగత కారణాలతో రాజీనామా చేయడంతో ఈ ఖాళీ ఏర్పడినట్లు తెలిపారు. 19 మంది మండల ప్రాదేశిక సభ్యులున్నారని, వీరిలో కనీసం 10 మంది(కోరం) సభ్యులు హాజరైతేనే ఎన్నికలు నిర్వహిస్తామన్నారు. కోరం లేకపోతే గురువారం నాటి ఎన్నికల ప్రక్రియ వాయిదా వేసి, 28న మరోసారి ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రత్యేకాధికారి ఆధ్వర్యంలో జరిగే ఈ ఎన్నికలకు ప్రత్యేక ఆహ్వానితులుగా స్థానిక ఎమ్మెల్యే, ఎంపీ, కో ఆప్షన్ సభ్యులు, ఎక్స్ అఫీషియో మెంబర్లు కూడా హాజరయ్యే అవకాశం ఉందని తెలిపారు. సభ్యులంతా హాజరై ఎన్నిక జరిగేలా సహకరించాలని కోరారు.

ఇళ్ల స్థలాల కోసం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా



ఇళ్ల స్థలాలు కేటాయించాలంటూ తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న పేదలు

పరవాడ: పట్టణ, గ్రామీణ ప్రాంతాల పేదలకు ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. సీపీఐ మండల కన్వీనర్ బూసి పరమేశ్వరి ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని కోరుతూ పరవాడ తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా నిర్వహించారు. ధర్నాలో దొరబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తొమ్మిది నెలలు గడుస్తున్నా.. పేదలకు ఇచ్చిన హామీలపై నోరు మెదపకపోవడం విచారకరమన్నారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి, ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందించాలని డిమాండ్ చేశారు. పేదలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చని పక్షంలో సీపీఐ ఆధ్వర్యంలో పేదలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహిస్తామని హెచ్చరించారు. అనంతరం స్థానిక డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌నాయుడును కలిసి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వి.రాజు, డి.హరీష్, ఎన్.స్వప్న, కె.రమ్య, నారాయణమ్మ పాల్గొన్నారు.

'ఇన్సూరెన్స్ ప్రీమియం సకాలంలో చెల్లించాలి'

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ విశ్రాంత ఉద్యోగుల జీఎంఐపీ ప్రీమియంను సకాలంలో చెల్లించాలని ఉక్కు విశ్రాంత ఉద్యోగుల సంఘ నాయకులు గుడే సుశీలా గజేంద్రరావు, జి.బోసుబాబ బి.భాస్కర రాజు, ఎస్ఎం.రఫీ కోరారు. ఈనెల 27లోగా నగదు చెల్లించని పక్షంలో వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఆయా కుటుంబాలు ఆరోగ్య బీమా రక్షణ కోల్పోయే పరిస్థితి ఉందని వాపోయారు. ఉక్కు యాజమాన్యం తక్షణమే స్పందించి నగదు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీఎంఐపీ, పీఆర్ఎంఎస్ ప్రీమియం గడువు తేదీ లోగా చెల్లించని పక్షంలో విశ్రాంత ఉద్యోగులకు భారీ నష్టం జరుగుతుందన్నారు. యాజమాన్యం సానుకూలంగా వ్యవహరించి ప్రీమియం చెల్లించాలని కోరారు.

అంగన్‌వాడీల్లో పూర్తి స్థాయి వసతులు



మాట్లాడుతున్న పీడీ జయదేవి

పెందుర్తి: అంగన్‌వాడీ కేంద్రాలకు పూర్తిస్థాయిలో సదుపాయాలు కల్పిస్తామని జిల్లా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ జి.జయదేవి తెలిపారు. స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలకు మూడు రోజుల అభ్యసన శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభ్యసన కేంద్రాలుగా అంగన్‌వాడీలను తీర్చిదిద్దాలన్నారు. నూతన జాతీయ విద్యా విధానంలో భాగంగా అంగన్‌వాడీలను మరింత బలోపేతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకుంటున్నాయని పేర్కొన్నారు. పలు అంశాలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు సూచనలిచ్చారు. సీడీపీవో డి.నీలవేణి, సూపర్‌వైజర్లు వీవీ గీతాలక్ష్మి, ఎ.లక్ష్మి, ఎం.లక్ష్మీదేవి, బేగం తదితరులు పాల్గొన్నారు.

సంతలకు తగ్గని క్రేజ్



యాదవజగ్గరాజుపేట వారపు సంత

- మాల్స్ వచ్చినా.. ఆన్‌లైన్‌లో ఇంటికి చేరినా
- వారపు సంతలకు ఆదరణ
- వేధిస్తున్న సదుపాయాల లేమి
- రోడ్ల వెంబడి నిర్వహణతో ట్రాఫిక్ ఇబ్బందులు

ఒకప్పుడు అవన్నీ శివారు ప్రాంతాలు.. జన సంచారం అంతంతమాత్రమే.. సాంకేతిక పరిజ్ఞానం.. దుకాణాలు.. ఆన్‌లైన్ మార్కెటింగ్ అందుబాటులో లేని రోజులు.. ఆ సమయంలో ప్రజలకు అవసరమ్యే వస్తువులు కొనుగోలు చేయడానికి సంతలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం నగరం విస్తరించింది. కాంక్రీట్ జంగిల్‌గా మారింది. అయినా అలవాటు ప్రకారం ఆ ప్రాంతాల్లోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు. ఎన్నిమాల్స్ వచ్చినా సంతలకు మాత్రం క్రేజ్ తగ్గలేదు. కాకపోతే వసతుల లేమితో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్యలు తప్పడం లేదు.

కూర్మన్నపాలెం: ఆధునిక ప్రపంచంలో అన్నీ ఇంటి ముందుకు వస్తున్నాయి. ఏ వస్తువు కావాలన్నా ఆన్‌లైన్‌లో బుక్ చేస్తే క్షణాల్లో వాలిపోతున్నాయి. అయినప్పటికీ పూర్వీకులు ఏ సదుపాయాలు లేని సమయంలో ఏర్పాటు చేసిన సంతలకు క్రేజ్ తగ్గలేదు. గ్రామీణ ప్రాంతాల నుంచి తట్టలు, తోపుడు బళ్లు ఇతర సాధనాలతో చిరు వ్యాపారులు తెచ్చే సరకులు విరివిగా అమ్ముడుపోతున్నాయి. వారం వారం నిర్వహించే ఈ సంతలకు పరిసర ప్రాంతాల ప్రజలు, మహిళలు చేరుకుని కావాల్సిన సరకులు, ఇతర వస్తువులు కొనుగోలు చేసుకుంటున్నారు. దీంతో సంత రోజుల్లో ఆయా ప్రాంతాలు కిటకిటలాడుతున్నాయి.

అందుబాటు ధరల్లో...

సంతల్లో తాజా కూరగాయలు లభిస్తాయి. రైతులు, గ్రామీణ ప్రాంతాల నుంచి చిరువ్యాపారులు రావడంతో వంట సామగ్రి, చీపుర్లు, ఇతర గృహ సామగ్రి విక్రయిస్తారు. దీంతో సరకులు చౌకగా లభిస్తాయని ప్రజలకు విశ్వాసం ఉంది. అందువల్లే మాల్స్ వచ్చినా.. ఆన్‌లైన్ షాపింగ్ ఉన్నా సంతలకు మరింత గిరాకీ పెరుగుతోంది.

కానరాని వసతులు

ఒకప్పటి శివారు ప్రాంతాలు నగరీకరణతో కాంక్రీట్ జంగిల్‌గా మారాయి. అయినా అలవాటు ప్రకారం ఆయా ప్రాంతాల్లోనే వారపు సంతలు నిర్వహిస్తున్నారు. అందుకు తగ్గట్టు సదుపాయాలు లేకపోవడంతో చిరు వ్యాపారులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆసీలు వసూలు చేస్తున్న అధికారులు వసతులు కల్పించడంలో అలసత్వం వహిస్తున్నారు. ఇందుకు కూర్మన్నపాలెం సమీపంలోని యాదవ జగ్గరాజుపేట, కణితి కాలనీల్లో ఏర్పాటు చేసే సంతలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. ప్రతి గురువారం యాదవజగ్గరాజుపేటలో సంత నిర్వహిస్తారు. గాజువాక పరిసర ప్రాంతాలతోపాటు అనకాపల్లి, సబ్బవరం, రూరల్ ప్రాంతాల నుంచి చిరు వర్తకులు మూటలు మోసుకుంటూ సంతలకు చేరుకొని అమ్మకాలు సాగిస్తారు. తాజా కూరగాయలు తెస్తుండడంతో వాటి కొనుగోలుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. యాదవజగ్గరాజుపేటకు చుట్టూఉన్న గ్రీన్‌సిటీ, ఫకీర్ తక్యా, తుంగ్లాం, కాపుజగ్గరాజుపేట, ఉక్కు నిర్వాసితకాలనీల నుంచి అధిక సంఖ్యలో మహిళలు సంతలకు వచ్చి కావాల్సిన సరకులు కొనుగోలు చేస్తారు. ఆటోనగర్‌లోని కార్మికులు ఈ ప్రాంతాల్లో ఎక్కువగా నివసిస్తుండటంతో వారంతా సంతలపై ఆధారపడుతుంటారు. అలాంటి ప్రాముఖ్యత కలిగిన సంతల్లో సదుపాయాల్లేకపోవడంతో ఎండైనా వానైనా భరించాల్సిన పరిస్థితి నెలకొంది.

చట్టాలపై అవగాహన అవసరం



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న మేజిస్ట్రేట్ కృష్ణప్రసాద్

అగనంపూడి: చట్టాలు, న్యాయంపై విద్యార్థి దశలోనే పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలని గాజువాక అదనపు చీఫ్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ ఎ.కృష్ణప్రసాద్ అన్నారు. జిల్లా లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో అగనంపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టాలకు లోబడి ప్రతీ మనిషి ప్రవర్తించాలని, విద్యార్థులు హక్కులతో పాటు బాధ్యతలు గుర్తెరగాలని సూచించారు. అప్పుడే న్యాయ వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌లపై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. ఈవ్ టీజింగ్, మానసిక వేదనకు గురిచేసే ఆకతాయిలపై పోక్సో చట్టం బనాయించడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ విషయంలో విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలన్నారు. న్యాయ విజ్ఞానంపై పలు సూచనలు, సలహాలు అందించారు. కార్యక్రమంలో న్యాయవాదులు గోడి రామకృష్ణ, త్రివేణి, దువ్వాడ ఎస్ఐ శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు ప్రసాద్, కృష్ణవేణి, విద్యార్థులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.